క్లుప్తంగా

నేడు 'యువత పోరు'

గుమ్మలక్ష్మీపురం/గరుగుబిల్లి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య, పార్టీ గరుగుబిల్లి మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు కోరారు. ఇదే విషయమై వారు మంగళవారం మీడియాతో మాట్లాడారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని విద్యార్థులను, జాబ్‌క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం నమ్మించి, మోసం చేసిందని విమర్శించారు. ఆయా హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టే యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, యువత, నిరుద్యోగులు పెద్దఎత్తున హాజరుకావాలన్నారు.

ఘనంగా తిరువీధి మహోత్సవం

సీతంపేట: స్థానిక లక్ష్మీగణపతి స్వామి వారి తిరువీధి మహోత్సవ కార్యక్రమం మంగళప్రదంగా నిర్వహించారు. సోమవారం సిద్ధి, బుద్ధి సమేత లక్ష్మీగణపతి స్వామి కల్యాణ అనంతరం మంగళవారం స్వామివారిని పల్లకిలో మోసుకుంటూ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఆలయ అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ మంత్రోచ్చరణల మధ్య పూజా కార్యక్రమాలు జరిపారు.

అన్నదానం


భోజనాలు చేస్తున్న గర్భిణులు

గరుగుబిల్లి: స్థానిక పీహెచ్‌సీకి వైద్య తనిఖీల నిమిత్తం విచ్చేసిన గర్భిణులకు మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో మంగళవారం అన్నదానం చేశారు. బురదవెంకటాపురానికి చెందిన బొత్స శ్రీహరిరావు, ఇంద్రాణి దంపతులు, బొత్స శివున్నాయుడు, గౌరమ్మ దంపతుల సహకారంతో గర్భిణులకు పౌష్టికాహార విలువలతో కూడిన భోజనం అందివ్వడం ఆనందంగా ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు.

ఘనంగా వారాల పండగ


పూజలందుకుంటున్న అమ్మవారి ఘటాలు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో శ్రీచింతల పోలమ్మ వారాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాల తిరువీధి చేపట్టారు. ఈ క్రమంలో భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, పువ్వులు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఎం.సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. మంగళవారం తెల్లవారు జాము నుంచే సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు చదురుగుడి, వనంగుడికి చేరుకోవడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. చదురుగుడి ఆలయంవద్ద క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఈవో వీవీసూర్యనారాయణ, ఎస్సై ఎం.వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు శంబర పోలమాంబ అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడిని ఈవో వీవీ సూర్యనారాయణ సాదరంగా స్వాగతించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పార్వతీపురం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 13న జరగనున్న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బడే నాగభూషణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లా పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు 13న లయన్స్‌క్లబ్ ఆవరణలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సమగ్ర దర్యాప్తు చేయండి



కొమరాడ మండల పరిషత్ కార్యాలయంలో ఏం జరుగుతుందో పూర్తి స్థాయిలో ఉన్నతాధికారులతో సమగ్ర దర్యాప్తు చేయాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఓ డిజిటల్ సహాయకురాలి వ్యక్తిగత ఖాతాకు మళ్లించారని, అలాగే పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా ఏజెన్సీ పంచాయతీ నిధులు పక్కదోవ పట్టించారని, ఎంపీడీవో మల్లిఖార్జునరావు తన కార్యాలయం ఉద్యోగులను తరచూ దుర్భాషలాడుతున్నారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయన్నారు. మండల అధికారుల తీరు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలకు సకాలంలో అందాల్సిన పౌరసేవలు అందడం లేదన్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీల నిధులపై సమగ్ర దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. -కొమరాడ

బెడ్లు లేక రోగుల అవస్థలు



సరిపడ బెడ్లు లేక గుమ్మలక్ష్మీపురం సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)కి వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. గత కొన్నిరోజులుగా ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. వైరల్ జ్వరాల బారినపడిన వారితో పాటు మలేరియా, డెంగీ వ్యాధులతో బాధపడుతున్నామనుకునే వారంతా వైద్య తనిఖీల నిమిత్తం సీహెచ్‌సీకి భారీగా చేరుకుంటున్నారు. ప్రతిరోజూ 200 నుంచి 250 వరకు ఓపీ నమోదవుతున్నట్లు ఆస్పత్రి రికార్డులు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో వైద్యసేవల కోసం ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య కూడా ఎక్కువవుతోంది. ఒక్కోసారి ఒకే బెడ్డుపై ఇద్దరు, ముగ్గురేసి రోగులకు వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనంతటికీ ఆస్పత్రిలో రోగులకు సరిపడ బెడ్లు లేకపోవడమేనని రోగుల బంధువులు వాపోతున్నారు. -గుమ్మలక్ష్మీపురం

అవగాహన ర్యాలీ



యువత మాదక ద్రవ్యాలను వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలను వివరిస్తూ పాలకొండ పోలీసులు పట్టణంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎస్‌ఐ ధర్మారావు ఆధ్వర్యంలో సిబ్బంది పోస్టాఫీసు రహదారిలో అవగాహన కలిగించారు. పట్టణంలోని పలువురు సంఘ సేవకులు, మహిళలు పాల్గొన్నారు. - పాలకొండ

'యువత పోరు'కు సిద్ధం


పాలకొండ: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి తదితరులు

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న యువత పోరును విజయవంతం చేద్దామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బుధవారం యువత పోరు కార్యక్రమంలో పార్టీ నిర్వహిస్తుందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న పోరు కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి లక్షల ఉద్యోగాలు అందించారని గుర్తు చేశారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకువచ్చారని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు అందిస్తామని నమ్మించిన కూటమి ప్రభుత్వం మోసగించిందని తెలిపారు. విద్యార్థులకు అందించాల్సిన తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. యువతి పోరు కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి తరలిరావాలని ఆ పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, మండల పార్టీ కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు కోరారు.

యువత పోరుకు తరలిరండి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరగనున్న యువతపోరుకు అన్ని వర్గాల మద్దతు ఇవ్వాలని ఎంపీపీ బి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతంపేటలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిలిరండి..

భామిని: వైఎస్సార్‌సీపీ బుధవారం మన్యం జిల్లా కేంద్రంలో తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం పిలుపునిచ్చారు. బత్తిలిలో దీనికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఆ పార్టీ కో ఆప్షన్ సభ్యులు విశ్వనాధ్ పట్నాయిక్, తోట లాల్, మజ్జి ప్రసాద్ పాల్గొన్నారు.


సీతంపేట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బి.ఆదినారాయణ

సమగ్ర సేవలు అందించాలి

పాలకొండ రూరల్: క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ అధికారులు సమగ్ర సేవలను ప్రజలకు అందించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శివ్వాల మన్మధరావు అన్నారు. పాలకొండ మండలంలో పీ-4 సర్వే తాజా స్థితిగతులు తెలుసుకునేందుకు కార్యదర్శులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మండల పరిధిలో పనుకువలస గ్రామంలో సర్వే జరుగుతున్న తీరుపై ఎంపీడీఓ రంగారావుతో కలసి పరిశీలించారు. అక్కడి ప్రజలకు సర్వేపై అవగాహన కలిగించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య మేరకు బోధన పొందుతున్న విద్యార్థుల హాజరు సరిపోల్చారు. విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. తుమరాడ గ్రామంలో ఈగల్ యూత్ (భవిష్యత్తుపై యువత దృష్టి) అనే అంశంపై అక్కడి యువకులు, నిరుద్యోగులతో చర్చించారు. అక్కడే ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు అధికారులకు అందించారు. అనంతరం వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు క్రాస్ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ప్రవళికతో చర్చించారు. మండల పరిధిలో గల మూడు వందల పైచిలుకు తాగునీటి బోర్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.


తుమరాడలో అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి మన్మధరావు

పీ4 సర్వేపై ఆరా


సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు


పీ-4 సర్వేపై ఆరా తీస్తున్న మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు మంగళవారం సందర్శించి, పీ4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వేపై ఆరాతీశారు. మొత్తం 1069 ఇళ్లకు గాను ఇప్పటివరకు 229 ఇళ్ల వారిని పీ4 సర్వేలో నమోదు చేసినట్లు సిబ్బంది పేర్కొన్నారు. సర్వే పూర్తికి రెండు రోజులే గడువు ఉన్నందున త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించి, చెత్త సేకరణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్ (పీ-4) సర్వే త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.సాయికృష్ణ సూచించారు. వీరఘట్టంలో జరుగుతున్న పీ-4 సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. సర్వే చేపడుతున్న పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విద్య మరియు సంక్షేమ సహాయకులు, మహిళా సంరక్షణ సహాయకులతో ఆయన మాట్లాడారు. సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ బి.వెంకటరమణ ఉన్నారు.

పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. మంగళవారం తెల్లవారు జాము నుంచే సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు చదురుగుడి, వనంగుడికి చేరుకోవడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. చదురుగుడి ఆలయంవద్ద క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఈవో వీవీసూర్యనారాయణ, ఎస్సై ఎం.వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు శంబర పోలమాంబ అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడిని ఈవో వీవీ సూర్యనారాయణ సాదరంగా స్వాగతించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నీలావడి యాత్రకు ప్రత్యేక బస్సులు

పార్వతీపురంటౌన్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల నీలావడి అగ్నిగంగమ్మ యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపోమేనేజర్ కనకదుర్గ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఆమె బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా మంగళవారం నుంచి ఒక ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈనెల 16నుంచి 19వ తేదీ వరకు జాతర ఉన్నందున ప్రతి రోజూ 10 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని తెలిపారు. పార్వతీపురం డిపో నుంచి ప్రతి 30 నిమిషాలకు బస్సు సర్వీసులు ఉంటాయని, ఒక్కో టికెట్ రూ.60 ఉంటుందని తెలిపారు. భక్తులంతా ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూపీసీల ద్వారా సంపద సృష్టించండి

గరుగుబిల్లి: ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వెస్ట్ ప్రాసెసింగ్ సెంటర్)ల ద్వారా వర్మీకంపోస్ట్ తయారు చేసి, రైతులకు సబ్సిడీపై ఇవ్వాలని తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం(సంపద) సమకూర్చాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. మండలంలోని ఉల్లిబద్ర, మరుపెంట గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను మంగళవారం సందర్శించిన ఆయన.. ఇంటింటా సేకరించిన చెత్తను ఇక్కడికి తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. ఇక్కడ తయారయ్యే సేంద్రియ ఎరువు ద్వారా పండించే పంటలు ఆరోగ్యానికి మంచివని, అలాగే అధిక దిగుబడులు ఇస్తాయన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మరీ ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ ఉరిటి రామారావు, ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్‌లు ఉరిటి నిర్మల, శెట్టి దివ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మరుపెంట ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

జియ్యమ్మవలస: ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని నిడిగళ్లగూడ గిరిజన గ్రామంలో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన.. నిర్మాణ దశలోని పలు ఇళ్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. మే 31వ తేదీ నాటికి నిర్మాణాలు పూర్తి చేసిన బీసీలకు రూ.50 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీలకు రూ.లక్షను ప్రభుత్వ సాయంగా అదనంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఇళ్లు కావాల్సిన వారు పీఎంఏవై 2.0 కింద దరఖాస్తు చేసుకుని, కుల, ఆదాయ ధ్రువపత్రాలు అందజేస్తే అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.


లబ్ధిదారులకు సూచనలిస్తున్న హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు

ఉన్నతి రుణాలు రికవరీ చేయాలి

సీతంపేట: ఉన్నతి రుణాలు రికవరీ చేయాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. వెలుగు ఏపీఎంలు, సీసీలతో ఐటీడీఏలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాల సభ్యులకు గతంలో ఇచ్చిన రుణాల రికవరీ పురోగతి సాధించాలన్నారు. 7 టీపీఎంయూ మండలాల్లో రూ.7 కోట్ల 67లక్షలు రికవరీ కావాల్సి ఉందన్నారు. ఎక్కువగా సీతంపేట మండలంలో రూ.3 కోట్ల 22 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. ఉన్నతి రుణాలు చెల్లించని వారిపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వీడీవీకేలను బలోపేతం చేయాలని సూచించారు. బుక్ కీపింగ్ వర్క్ పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ సన్యాసిరావు, డీపీఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

మహిళలు మరింతగా రాణించాలి



మహిళా సాధికారి వారోత్సవాల్లో భాగంగా ఆర్ష్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బుడ్డడుగూడ, తాలాడ గ్రామంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ఎస్.తిరుపతిరావు మాట్లాడుతూ మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సామాజికంగా బలపడడానికి వచ్చే అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ష్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ ఆదివాసీ వ్యవసాయ ఉత్పత్తులు, సాంప్రదాయ పంటలు, హస్తకళా ఉత్పత్తులు విక్రయించడం కోసం ఆదివాసీ వికాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వనమిత్ర ఎఫ్‌పీసీ సీఈఓ కె.పద్మ, ఆదివాసీ మహిళా ఎఫ్‌పీఓ సీఈఓ ఆరిక గౌతమి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎల్.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. - సీతంపేట

చింతల బెలగాం పంటపొలాల్లో ఏనుగుల గుంపు



జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం పంట పొలాల్లో మంగళవారం ఏనుగుల గుంపు దర్శనమిచ్చాయి. ఉదయం వెంకటరాజపురంలో వరి పంటను ధ్వంసంచేసి సాయంత్రానికి వెంకటరాజపురం, బాసంగి మీదుగా చింతలబెలగాంకు చేరుకున్నాయి. రాత్రి సమయాన గ్రామంలోకి చొచ్చుకురావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వరి, అరటి పంటను ధ్వంసం చేస్తే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిగురించిన ఆశలు!

- ఆశాజనకంగా జీడిమామిడి పంట
- పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో విస్తారంగా సాగు
- పూత, పిందె బాగుండడంతో దిగుబడిపై ఆశలు


గొడుగూడలో విరగ్గాసిన జీడిపిక్కలు

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. దీంతో అధిక దిగుబడులపై రైతులు గంపెడాశలు పెట్టుకుంటున్నారు. పూత, పిందె బాగుండడంతో ఈ ఏడాది అయినా తమ ఆశలు ఫలిస్తాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'జీడి నాటు-దారిద్ర్యానికి కాటు' అన్నట్లుగా ఇక్కడి గిరిజనులను అనాదిగా వెంటాడుతున్న దారిద్ర్యం అనే ఆర్థికలేమి నుంచి బయటపడేందుకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ), పార్వతీపురం వారు 1980-90 దశకంలో జీడితోటల పెంపకానికి ఓ బృహత్తరమైన ప్రణాళిక వేసింది. ఫలితంగా పార్వతీపురం, సీతంపేట ఏజెన్సీ ప్రాంతాల్లో జీడిమామిడి తోటల సాగు విస్తారంగా పెరిగాయి. మొదటగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో.. ఆ తర్వాత జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, సాలూరు ప్రాంతాల్లో జీడిమామిడి తోటల పెంపకం ప్రోత్సహించారు. ఫలితంగా గిరిజనుల బతుకులు మారాయి. ఆ తోటలే స్థానిక గిరిజనులకు జీవనోపాధిగా మారాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిశిఖర గ్రామాలైన పొల్ల, దోనుబాయి, పెదరాం మొదలుకుని ఏజెన్సీ ప్రాంతమంతటా జీడితోటల పెంపకం విరివిగా జరుగుతోంది. ఆయా ప్రాంతాల వారికి వేసవిలో ఈ జీడిమామిడి తోటలే జీవనాధారం. ప్రస్తుతం పంట బాగుండడంతో గతేడాది కన్నా ఈ ఏడాది లాభాలు బాగుంటాయని ఆశిస్తున్నట్లు రైతులు, పెంపకందారులు అంటున్నారు.

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో సాగు ఇలా..

మండలం	జీడిమామిడి సాగు ఎకరాల్లో..
గుమ్మలక్ష్మీపురం	15,500
కురుపాం	14,000
జియ్యమ్మవలస	4,500
కొమరాడ	4,500
సాలూరు	4,500
మక్కువ	2,500
పార్వతీపురం	1,500
సీతంపేట	7,199
భామిని	1,200
వీరఘట్టాం	1,286
పాలకొండ	350